# అధ్యాయం 5

## 5.1.1 అనువాదకుడు

### విషయ క్రమం

1. ఉద్దేశం
2. ప్రవేశిక
3. అనువాదకుడు – నిర్వచనం
4. అనువాదం చేసేటప్పుడు అనువాదకుడు గుర్తించవలసిన అంశాలు
5. ఉపయుక్త గ్రంథాల సూచిక

---

### 1. ఉద్దేశం

---

ఈ భాగంలో మీరు అనువాద ప్రక్రియగురించి పునశ్చరణం చేసి, "అనువాదకుడు" అనే పదానికున్న నిర్వచనాలలో కొన్నింటిని, అనువాదం చేసేటప్పుడు అనువాదకుడు గుర్తించవలసిన ముఖ్యాంశాలను నేర్చుకోగలరు. ఈ భాగం పూర్తయిన తర్వాత మీరు "అనువాదకుడు" అనే పదాన్ని నిర్వచించగలగటమే కాక అనువాదం చేసేటప్పుడు వాడు దృష్టిలో ఉంచుకోవలసిన అంశాలను కూడా పేర్కొనగలరు.

---

### ౨. ప్రవేశిక

---

ఆధునిక యుగాన్ని అనువాద యుగమని అనవచ్చు. అనువాదమనేది కొత్త ప్రక్రియ కాదు. ప్రాచీన కాలంనుంచే ఎక్కువ అనువాదాలుండేవి. తెలుగు సాహిత్యంలో ఆది కవి నన్నయ తోపాటు తిక్కన, ఎర్రన (కవిత్రయం) సంస్కృత మహాభారతాన్ని తెలుగులోకి అనువదించారు. ఆయన తర్వాత ఎంతో

మంది కవులు, రచయితలు ఎన్నో రచనలను వివిధ భాషలనుంచి మన భాషలోకి అనువదించారని సాహిత్య ఆధారాల ద్వారా మనకు తెలుస్తుంది.

ఈ ఆధునిక కాలంలో కూడా విజ్ఞానశాస్త్ర, సాహిత్య, పరిశోధనా, విద్యా, వ్యాపార, స్వాస్థ్య, సాంస్కృతిక, రాజకీయ, వికాస, క్రీడా ఇంకా అనేక రంగాలలో అనువాదాల ప్రాముఖ్యత బాగా పెరిగింది. అసలు అనువాదమే ప్రపంచానికి వారధి అని చెప్పటం అతిశయోక్తి కాదు. ప్రపంచంలో ఏ మారుమూలనో జరిగిన సంఘటనలు, పరిశోధనలు, పరిణామాలు మొదలైనవి తక్షణమే ప్రపంచంలో విభిన్న భాషలలోకి అనువాదం అయి వివిధ భాషా వ్యవహర్తలకు అందుతున్నాయి. కాల, స్థల, భాషా పరిమితి లేకుండా మన ఆలోచనలను, సంఘటనలను ఇతరులకు తెలియజేయుటమే అనువాదం యొక్క ముఖ్యోద్దేశ్యం. భాషా అడ్డంకులను విచ్ఛిన్నం చేయటానికి అనువాదం కీలక పాత్ర వహిస్తుంది.

వృత్తిపరమైన దృక్కోణంనుంచి పరిశీలిస్తే అనువాదకుడు ఒక రకమైన మధ్యస్థుడు. అతను వివిధ భాషీయులమధ్య, సంస్కృతులమధ్య వారధి వంటివాడు. అనువాద ప్రక్రియను బాగా అర్థం చేసుకోవాలంటే, ముందు మనం అనువాదకుడు ఎటువంటివాడు అనీ, అనువాదకుడికీ దుబాసీకీ (ద్విభాషి) మధ్య ఉన్న తేడాలనూ – ఇద్దరి బాధ్యతల్లో ఉన్న భేదాలనూ తెలుసుకోవాలి.

---

## 3. అనువాదకుడు – నిర్వచనం

---

అనువాదమంటే మూలభాషలోని ఆలోచనలను, భావాలను, విషయాన్ని లక్ష్యభాషలోకి అనువర్తించటం. అనువాదం చేసే వ్యక్తి అనువాదకుడు, అనువాదకర్త. అనువాదమనేది కొంచెం తాపీగా చేసే పని. అప్పటికప్పుడు ఇతర భాషలోని ప్రసంగాన్ని, స్వభాషలోకి అనువదించి చెప్పే వ్యక్తి దుబాసీ. పూర్వం ఈ పని చేసేవాడిని "వాచకుడు" అనే పేరు ఉండేది.

“ఎవ్వరైతే భాషాంతరీకరణం చేస్తారో” – అని అమర్కోష్.భారత్ “అనువాదకుడు” అనే పదానికిచ్చిన నిర్వచనం. అనువాదకుడు అనే పదానికి సమానార్థకాలు “అనువాదకర్త, అనువాది, భాషాంతరీకరుడు” అని సూచించింది.

> “someone who changes the words of one language into the words in another language that have the same meaning” (Cambridge Dictionary)

– ఒక భాషలోని పదాలను మరొక భాషలోని సమానార్థక పదాలుగా మార్చే వ్యక్తి — అని కేంబ్రిడ్జ్ నిఘంటువు “translator” అనే పదానికిచ్చిన అర్థం.

> “The definition of a translator is a person who helps people who speak different languages to communicate or who takes something (such as a speech or a book) in one language and who puts it into a different language for people to understand. (https://www.yourdictionary.com.)” (Köksal & Yürük, 2020: 328).

వివిధ భాషలు మాట్లాడే వ్యక్తులకు సంభాషించటానికి సహాయం చేసేవాడు లేదా ఒక భాషలోనున్న ఏదైనా (ప్రసంగం లేదా పుస్తకం వంటివి) తీసుకుని, ప్రజలు అర్థం చేసుకునేలా దాన్ని వేరే భాషలో మార్చే వ్యక్తి అనువాదకుడు అని నిర్వచించవచ్చు. కాని అనువాదకుడు ఎవడని వివరించటానికి ఈ నిర్వచనం సరిపోదు అని Köksal & Yürük (2020) తెలియజేశారు. వారి అభిప్రాయాన్నిబట్టి అనువాదకుడు అంటే ఒక భాషనుంచి మరొక భాషలోకి పదాలను అనువదించేవాడు మాత్రమే కాదు. అనువాదకుడిగా మారటం అంటే కనీసం రెండు భాషలలో ప్రావీణ్యం సంపాదించటం కాదు. ఉత్తమమైన అనువాదకులుగా తయారవటానికి కేవలం వివిధ భాషల పదజాలం, వ్యాకరణం మొదలైనపై ప్రావీణ్యం పొందటం కాదు. కేవలం ఈ ప్రావీణ్యం విభిన్న సంస్కృతుల నేపథ్యాలకు చెందే వ్యక్తుల ప్రత్యేకతలను గుర్తించటానికి సరిపోదు.

Julia Thornton అభిప్రాయాన్నిబట్టి “*Being a translator means removing a language barrier and, as much as possible, bridging a cultural gap between people*”. — అనువాదకుడు కావటమనేది భాషా అడ్డంకితోపాటు, సాధ్యమైనంతవరకు, జనుల మధ్యనున్న సాంస్కృతిక అంతరాన్ని తొలగించటం.

అనువాదకుడు అనే పదానికున్న నిర్వచనాలను పరిశీలిస్తే, అనువాదకుడు రెండు వేర్వేరు భాషలకు, రెండు విభిన్న సంస్కృతులకు మధ్యవర్తి అని చెప్పవచ్చు. అనువాదకుడు పదాలను అనువదించేవాడు మాత్రమే కాడు; మూల రచనలోని ముఖ్యాంశాలను భావి పాఠకులకు అందజేయటానికి ఉత్తమ మార్గాన్ని ఎంపిక చేసేవాడు కూడా.

మూల రచనకు ప్రత్యామ్నాయంగా పనిచేయటంతో పాటు, మూల భాష తెలియని పాఠకులకు విషయాన్ని అర్థమయ్యేట్లు చేయటమే అనువాదం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఇది అనువాదకుడికి అసాధ్యమైనపూట.

- **మూలభాషా పరిచయం, లక్ష్యభాషాజ్ఞానం, విషయ పరిజ్ఞానం**

అనువాద ప్రక్రియ విజయవంతంగా జరగాలంటే అనువాదకుడికి మూలభాషతోను, లక్ష్యభాషతోను పరిచయం ఉండటం ఎంతో అవసరం. అనువాదకుడు లక్ష్యభాషలో రచన చేస్తాడు. కాబట్టి లక్ష్యభాషా స్వరూప స్వభావాలు అతనికి పూర్తిగా తెలిసి ఉండటం ఎంతో అవసరం. మూలభాషతో పరిచయం అనేక రకాలుగా ఉండవచ్చు.

విజ్ఞానశాస్త్రం, గణితశాస్త్రం మొదలైన విషయ ప్రధానమైన రచనలను అనువాదం చేసేటప్పుడు మూలభాషతో సాధారణ పరిచయం ఉంటే చాలు. వార్తాపత్రికల్లో వార్తల అనువాదంలో కూడా అంతే. అయితే విషయంతో మాత్రం తగిన పరిచయం అవసరం. సృజనాత్మక రచనలలో భాషను ఉపయోగించే పద్ధతిలో వైశిష్ట్యం, ప్రత్యేకత ఉంటుంది. సందర్భాన్నిబట్టి చాలా మాటలకు అర్థం మారుతుంది. సామెతలు, జాతీయాలు, నుడికారాలు మొదలైన భాషకు సంబంధించిన ప్రత్యేకతలన్నీ సృజనాత్మక రచనలలో కనిపిస్తాయి. ఈ మెళకువలన్నీ తెలిస్తేనే కాని మూలభాషలోని సృజనాత్మక రచనలకు, వాటిలోని అభివ్యక్తికి సాధ్యమైనంత సమానమైన అభివ్యక్తిని లక్ష్యభాషలో తీసుకుని రావటం కష్టం (రాధాకృష్ణ, 2003).

అనువాదకుడికి మూలభాషా పరిచయం, లక్ష్యభాషాజ్ఞానం, విషయ పరిజ్ఞానం ఈ మూడూ ఉండటం అవసరం. ఒక్కొక్కసారి ఈ మూడింటిలో ఏదో ఒకటి అనువాదకుడికి లేకపోవచ్చు. ఉదాహరణకు

లక్ష్యభాషాజ్ఞానం, విషయ పరిజ్ఞానం ఉన్నా మూలభాషతో అంతగా పరిచయం లేకపోవచ్చు. అలాంటి సందర్భాలలో మూలభాషా వ్యవహర్తతోగాని, మూలభాషతోగాని పరిచయం ఉన్నవాళ్ల సహాయంతో అనువాదం నిర్వహించవచ్చునని శ్రీ బూదరాజు రాధాకృష్ణగారు (2003) సూచించారు.

అంతేకాకుండా అనువాదకుడు తర్జుమా చేయటానికి నిఘంటువుల సహాయం కూడా తీసుకోవచ్చు. కాని అన్ని వేళలా నిఘంటువులు అనువాదకుడికి తగినంతగా తోడ్పడవు. నిఘంటువులలో పర్యాయపదాల రూపంలోనో, వివరణల రూపంలోనో సూటిగా అర్థాలుంటాయి. కాని భాషావ్యవహారంలో సందర్భాలూ పక్కన ఉండే పదాలూ పదానికి అర్థాన్నిస్తాయని కూడా సూచించారాయన.

శ్రీ రాధాకృష్ణగారు (2003: 22) "అనువాద పాఠాలు" అనే పుస్తకంలో ఇచ్చిన ఉదాహరణలను చూద్దాం.

- Man అనే పదానికి 'మనిషి' అని నిఘంటువులలో అర్థం కనిపిస్తుంది. మనిషి అంటే స్త్రీ, పురుషులు ఇద్దరు కూడా. కాని She is a man-hater అన్నప్పుడు man అనే దానికి 'పురుషుడు' అనే అర్థం. ఆ వాక్యాన్ని 'ఆమె పురుషద్వేషి' అని అనువదించాలి.
- Young manలో youngకి manకి ప్రత్యేకంగా ప్రతి పద రూపంలో 'చిన్న మనిషి' అనే అనువాదం చాలా కృత్రిమం. తెలుగులో యువకుడు అని ఒక్క మాటలో దాన్ని అనువదించాలి.
- Minister అనే పదానికి 'మంత్రి' అనే అర్థమే చాలా మందికి తెలిసింది. కాని మత గురువు అని కూడా దానికి అర్థం ఉంది.

కాబట్టి ఒక పదాన్ని అనువదించేటప్పుడు దేశకాల పాత్రాది సందర్భాలను తెలుసుకోవటం ఎంతో ముఖ్యం.

- **అనువాదకుడు పరిశోధకుడై ఉండాలి.**

అనువాదకుడికి విషయ పరిజ్ఞానం, లక్ష్యభాషలో లేఖన సామర్థ్యముండాలని ముందే చూశాం. అదనంగా అనువాదకుడు పరిశోధకుడై ఉండాలనీ, అనువాదం–పరిశోధన రెండూ కలసి సాగుతాయని చాలా మంది

పరిశోధకులు అభిప్రాయపడతారు. మామూలుగా క్లిష్టమైన అనువాదాలు చేసేటప్పుడు అనువాదకులకు పరిశోధనలు తోడ్పడతాయి.

చట్టపరమైన పత్రాలు, సాంకేతిక కరదీపికలు, సృజనాత్మక రచనలు మొదలైనవాటిని అనువదించాలంటే అనువాదకుడు వీటికి సంబంధించిన ప్రత్యేక సందర్భాలతో పాటు అర్థచ్ఛాయాభేదాలను కూడా అర్థం చేసుకోవాలి. కొన్ని పర్యాయాలు అనువాదకులకు వేరొక దేశం యొక్క న్యాయవ్యవస్థ గురించిగానీ, ఒక వస్తువుకున్న సాంకేతిక లక్షణాలు లేదా సాహిత్య రచనలోని సాంస్కృతిక సూచనలను పరిశోధించాల్సిన అవసరం ఉండవచ్చు.

అనువాదమనేది పరిశోధనల శ్రేణి. ఒక రంగంలో అనువాదకులు ప్రావీణ్యం కలిగి ఉన్నప్పటికీ, సాంకేతిక విజ్ఞానం దినదినాభివృద్ధి చెందుతుందనేది యథార్థమే. అనువదిస్తున్నప్పుడు వారికి తెలియని కొత్త సమాచారం ఎల్లప్పుడూ ఉంటుంది. అటువంటప్పుడు వారు కేవలం నిఘంటువుల మీద ఆధారపడకుండా వారికి తెలియని వాటిని సరిగ్గా పరిశోధించి, వారికి సరియైన ఆలోచన ఉందని నిర్ధారించుకోవాలి. అందువల్లనే అనువాదంలో పరిశోధన అనివార్యం.

## 4. అనువాదం చేసేటప్పుడు అనువాదకుడు గుర్తించవలసిన అంశాలు

అనువాదకుడు లిఖిత రూపంలో ఉన్న విషయాన్ని ఒక భాషనుంచి మరొక భాషలోనికి అనువదిస్తాడు. మూలభాషనుంచి లక్ష్యభాషలోనికి భాషాంతరీకరణం చేసేటప్పుడు అనువాదకుడు కొన్ని ముఖ్యమైన అంశాలను గుర్తించాలి. శ్రీ రాధాకృష్ణగారు (2003) వీటిని ఈ కింది విధంగా వివరించారు.

✓ **రచనాకాలం**

అనువాదం చేసేటప్పుడు అనువాదకుడు మూలరచన కాలాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. చారిత్రక కాలంలో ఒక పదానికి అర్థాలు మారవచ్చు. అందువల్ల రచనా కాలాన్నిబట్టి పదానికున్న అర్థాన్ని గుర్తించి అనువాదం చేయవలసి ఉంటుంది.

*ఉదాహరణకు:*

– 'చింతించు' అనే దానికి నన్నయ కాలంలో 'ఆలోచించు' అనే అర్థముండేది. కాని ఆధునిక కాలంలో దీనికి 'విచారించు, దుఃఖించు' అని అర్థం. నన్నయ భారతాన్ని మరో భాషలోకి మార్చే అనువాదకుడు ఆధునికార్థంలో దాన్ని అనువదిస్తే నన్నయ అభిప్రాయానికి భిన్నమైన భావం అనువాదంలో వస్తుంది.

ఒకే అక్షర క్రమం (spelling) గాని, ఉచ్చారణగాని ఉన్న పదాలు భిన్న భాషలలో ఒకే అర్థాన్ని ఇవ్వకపోవచ్చు. ఒక భాషలోంచి భిన్న భాషలు ఆదానం (borrowing)గా తెచ్చుకున్న ఒకే పదం ఒక్కొక్క భాషలో ఒక్కొక్క అర్థాన్ని ఇవ్వవచ్చు. అనువాదకుడు ఈ అంశాన్ని జాగ్రత్తగా గుర్తించవలసి ఉంటుంది.

కింది ఉదాహరణను గుర్తించండి:

– 'అనుమాన్' అనే పదానికి హిందీలో "ఊహించటం అని అర్థం". తెలుగులో doubt అని అర్థం. 'నాకు వాడిపై అనుమానం వచ్చింది' అనే తెలుగు వాక్యాన్ని 'ముఝే ఉన్ పర్ అనుమాన హువా' అని హిందీలోకి అనువదిస్తే అర్థమే మారిపోతుంది.
– హిందీలో 'జాతి' అంటే కులం అని అర్థం. తెలుగులో nation, nationality అని కూడా అర్థం.

ఇలా మూల, లక్ష్యభాషలలో ఒకే పదానికి ఉండే అర్థభేదాలను అనువాదకుడు గుర్తించవలసి ఉంటుంది. అంటే అనువాదకుడికి అర్థ పరిణామ జ్ఞానం అవసరమన్న మాట.

- **ఒకే పదం ఒకే భాషలో రచనాప్రక్రియనుబట్టి, విషయాన్నిబట్టి, శాస్త్రాన్నిబట్టి భిన్నమైన భావాలను, అర్థాలను సూచించటం**

ఒకే పదం ఒకే భాషలో రచనాప్రక్రియనుబట్టి, విషయాన్నిబట్టి, శాస్త్రాన్నిబట్టి భిన్నమైన భావాలను, అర్థాలను సూచిస్తుంది.

*ఉదాహరణకు:*

– తెలుగులో 'వర్ణం' అనే పదానికి ప్రకృతిపరంగా 'రంగు' అని అర్థం.
  అది ప్రాచీన సమాజ వ్యవస్థపరంగా కులాలను సూచిస్తుంది.
  కాబట్టి అనువాదకుడికి భాషాజ్ఞానంతో పాటు విషయ పరిజ్ఞానం కూడా ఎంతో అవసరం.

- **మూలభాషలోని పదానికి సమానమైన పదం లక్ష్యభాషలో లేకపోవటం**

మూలభాషలోని పదానికి సమానమైన పదం లక్ష్యభాషలో లేకపోవచ్చు. అటువంటి సందర్భాల్లో ఆ పదానికి దగ్గిరగా ఉన్న అర్థం ఇచ్చేదాన్ని ఉపయోగించటమో, సరిపడే పదబంధాలను సృష్టించుకోవటమో, వివరణ రూపంలో చెప్పటమో అనువాదకుడు చేయవలసి ఉంటుంది.

*ఉదాహరణకు:*

– యజ్ఞోపవీతాన్ని holy thread అని అనువదిస్తారు. రెండు భాషల్లో సమానార్థాన్నిచ్చే పదాలు లేకపోవటానికి ఆ భాషా వ్యవహర్తల సంస్కృతిలో, ఆచార వ్యవహారాల్లో, మత కర్మకాండల్లో ఉన్న భేదాలు కారణాలు కావచ్చు.

– ఇంగ్లీషులో feel అనే పదానికి సమానమైన అర్థాన్నిచ్చే పదం తెలుగులో లేదు. చలం వంటి రచయితలు 'ఫీల్ అవుతున్నాను' అని ఆ పదాన్ని యథాతథంగా వాడారు. దానికి దగ్గరగా ఉండే పదం వాడాలంటే 'అనుభవించటం' అనే పదాన్ని ఉపయోగించవచ్చు.

ఇంగ్లీషు సంస్కృతి ద్వారా కాలాన్ని అనుసరించిన భోజన భేదాన్ని సూచించే breakfast, lunch, dinner మొదలైన భావాలు భారతీయ సంస్కృతిలో ప్రవేశించాయి. ఈ పదాలకు "మధ్యాహ్న భోజనం, సాయంకాలం భోజనం, రాత్రి భోజనం" లాంటి పదబంధాలను ఉపయోగించవచ్చు. ఇంగ్లీషు పదాలను యథాతథంగా ఉపయోగించినా ఇబ్బంది లేదు. భోజనం అనే మాటనే అన్నిటికీ వాడవచ్చు. మూలభాషలోని భావం లక్ష్యభాషలో రావటానికి ఇబ్బంది లేనంతవరకు సౌకర్యాన్ని బట్టి పదాలను ఉపయోగించవచ్చు.

అదే విధంగా వేర్వేరు భాషలలో రంగులలో అవాంతర భేదాలను సూచించే పదాలలో భేదాలుండవచ్చు. ఒక భాషలో రంగులలో అవాంతర భేదాలను సూచించే పదాలు ఎక్కువగా ఉంటే ఇంకొన్ని భాషల్లో తక్కువగా ఉండవచ్చు. ఇంగ్లీషుతో పోలిస్తే తెలుగులో రంగుల భేదాలను సూచించే పదాలు తక్కువ. కొన్ని విశేషణాలు వాడటం ద్వారా తెలుగులో ఇంగ్లీషులో ఉండే రంగుల భేదాలను సూచించటానికి అనువాదకుడు ప్రయత్నం చేయవచ్చు.

- **అన్ని రంగాలలో జరుగుతున్న అభివృద్ధివల్ల భాషలలో కొత్త పదజాలం చేరటం**

ఆధునిక భారతీయ జీవితంలో ప్రపంచంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగంగా, దేశాల పరస్పర సంబంధం కారణంగా కొత్త కొత్త క్రీడలు, యంత్ర సాధనాలు ప్రవేశిస్తున్నాయి. వాటికి సంబంధించిన పదజాలాన్ని, వాగ్రూప సంకేతాలను మూలభాషనుబట్టి లక్ష్యభాషలో యథాతథంగా వాడుకోవచ్చు. క్రికెట్ లో వికెట్, బ్యాటింగ్ మొదలైన పదాలు తెలుగు పత్రికలు వాడుతూనే ఉన్నాయి. అవి తెలుగు వ్యవహారంలో భాగం అయిపోయాయి.

- **అనువాద రచన –పాఠక వర్గాలు**

మూలభాషలోని సందేశాన్ని లక్ష్యభాషకు సంబంధించిన పాఠకుడికి చక్కగా అందించగలగటాన్నిబట్టి అనువాదం సమగ్రమూ, పరిపూర్ణమూ అయినదో, కానిదో నిర్ణయించగలం. ఇది ఒక్కొక్కసారి అనువాదం చేసే రచనపైన, అనువాద పాఠకులపైన ఆధారపడి ఉంటుంది.

ప్రతి అనువాదానికి ప్రత్యేక ప్రయోజనం ఉంటుంది. పాఠక వర్గాన్నిబట్టి, స్థాయినిబట్టి, గ్రంథాన్ని బట్టి, గ్రంథవిషయాన్ని బట్టి ఈ ప్రయోజనాలు ఉంటాయి. అనువాద ప్రయోజనాలు కింది రకాల పాఠకవర్గాలపైన ఆధారపడి ఉంటాయని శ్రీ రాధాకృష్ణగారు (2003) సూచించటం జరిగింది.

1. మూలభాష అసలు తెలియని పాఠకుడు – అసలు తెలుసుకోవాలనే దృష్టిలేనివాడు
2. అనువాద సహాయంతో మూలభాషను నేర్చుకొనే పాఠకుడు
3. మూలభాష తెలిసి తరువాత మరచిపోయిన పాఠకుడు
4. మూలభాష బాగా తెలిసిన పాఠకుడు
5. అనువాదం అనే దృష్టితోకాక కేవలం విషయంకోసం చదివే పాఠకుడు

✓ **వాక్యనిర్మాణంలో తేడాలు**

అనువాదం శాస్త్రం, కళ కూడా. అనువాదం ప్రత్యేక పద్ధతులపైన, సూత్రాలపైన ఆధారపడి ఉంటుంది. అనువాదం భాషాశాస్త్ర పరిజ్ఞానం పైన కూడా ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ప్రత్యేకమైన పద్ధతులపైన, శాస్త్రజ్ఞానంపైన ఆధారపడిన ఏ అధ్యయనమైనా, కృషి అయినా శాస్త్రీయమే అవుతుంది. అనువాదకుడికి మూల, లక్ష్యభాషల స్వరూపానికి, నిర్మాణానికి సంబంధించి తులనాత్మక అధ్యయనం అవసరం.

మూల, లక్ష్యభాషలలో ధ్వనులు, పదాలు, పదబంధాలు, వాక్యాలు, అర్థశాస్త్రం (semantics) మొదలైన అంశాలలో పోలికలు, తేడాలు ఉండవచ్చు. ఈ పోలికలు, తేడాలు తెలియటం అనువాదకుడికి అవసరం. తమిళం, కన్నడం, తెలుగు మొదలైన ద్రావిడ భాషలలో వాక్య రచన కర్త, కర్మ, క్రియ (SOV) అనే క్రమంలో

ఉంటుంది. ఇంగ్లీషులో వాక్యం కర్త, క్రియ, కర్మ (SVO) అనే పదక్రమంలో ఉంటుంది. అనువాదకుడు ఇంగ్లీషునుంచి తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు వాక్యనిర్మాణంలో ఉండే తేడాను గ్రహించి లక్ష్యభాషా స్వభావానికి అనుగుణంగా అనువాదం చేయవలసి ఉంటుంది. అనువాదకుడు మూల, లక్ష్యభాషా వ్యవహర్తల సాంస్కృతికమైన పోలికలను, తేడాలను కూడా గుర్తించగలగాలి. సాంస్కృతిక భేదాలవల్ల అభివ్యక్తిలో కూడా భేదాలుంటాయి. దీన్నిబట్టి అనువాదకుడు అనువాదంలో రెండు రకాల సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది.

1. భాషా సమస్యలు
2. సాంస్కృతిక సమస్యలు.

ఈ రెండు సమస్యలను పరిష్కరించుకొనే నైపుణ్యం అనువాదకుడికి ఉండాలి. అనువాదం అనువాదకుడి ప్రతిభ మీద కూడా ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా సృజనాత్మక రచనల అనువాదంలో మూలకర్త వ్యక్తిత్వం, ఆత్మాభివ్యక్తి అనువాదంలో కూడా కనిపించాలి. కొన్ని అనువాదాలు అనువాదాలలాగా కాకుండా స్వతంత్ర రచనలలాగా ఉంటాయి. ఈ విధమైన అనువాదాలు అనువాదకుడి ప్రతిభ మీద ఆధారపడి ఉంటాయి (రాధాకృష్ణ, 2003).

## ఉపయుక్త గ్రంథాల సూచిక:


అమరకోశ లింగ్విస్టిక్స్ ప్రా॰ లిమిటేడ (*online dictionary*). Available from: https://అమర్కోష్.భారత్/తెలుగు/పదం/అనువాదకుడు/ [Accessed on: 05.05.2024]

రాధాకృష్ణ, బి. (2003). *అనువాద పాఠాలు*. హైదరాబాదు: ఆకృతి ఆఫ్ సెట్ ప్రింటర్స్.

Cambridge Dictionary (*online*). Available from: https://dictionary.cambridge.org/dictionary/english/translator [Accessed on: 05.05.2024]

Köksal, O. & Yürük, N. (2020). The Role of Translator in Intercultural Communication. *International Journal of Curriculum and Instruction*. Vol. 12(1) (2020); p. 327–338. Available from: https://files.eric.ed.gov/fulltext/EJ1249472.pdf [Accessed on: 05.05.2024]

Prattipati, M. (nd). Role of Translator. Available from: https://www.academia.edu/31763228/Role_of_Translator [Accessed on: 04.05.2024]

The Open Mic. Available from: https://theopenmic.co/what-does-it-mean-to-be-a-translator/ [Accessed on: 05.05.2024]

అనువాదకుడు - The Translator © 2024 by Rajwantee Dalliah, Mahatma Gandhi Institute is licensed under CC BY 4.0

-----★★★★-----